అంతే! నిద్రపోతున్న గురువు తక్కున లేచి కోపంగా అరిచాడు.

"గురు ద్రోహి! గురువు తినకుండా నువ్వు తింటావా?"

వెంటనే శిష్యుడు పెసల గిన్నెని నేలకేసి విసిరి కొట్టాడు. గబ గబ బయటకి వెళ్తున్న శిష్యుడి వంక చూసి నవ్వుతూ చెప్పాడు గురువు.

"నువ్వు అదృష్టవంతుడివి, నా దగ్గర శిష్యరికం మొదలెట్టిన మొదటి రోజే నీకు రెండు పాఠాలు బోధించాను. మన శరీర సౌఖ్యాన్ని త్యాగం చేసి ఇతరులకి సేవ చేయాలన్నది మొదటిది. రెండోది సహనం. ఎవరిమీదా కోపం తెచ్చుకోకూడదు. కోపం వచ్చినా దాన్ని ప్రదర్శించకుండా దాచుకోవాలి."

తనకి ఆధ్యాత్మిక పాఠాలు నేర్పించడానికి గురువు అలా ప్రవర్తించాడు అని గ్రహించిన ఆ శిష్యుడు వెంటనే క్షమించమంటూ గురువు పాదాలమీద పడ్డాడు.

## 78. ఏది బలమైంది?

ఓ సారి సూర్యుడికి, వాయుదేవుడికి తామిద్దరిలో ఎవరు గొప్పంటే ఎవరు గొప్పని లడాయి పడింది.

"చూస్తూండు. నీకన్నా నేనే శక్తిమంతుడ్నని తక్షణం ఋజువు చేస్తాను. ఆ మనిషి ఒంటి మీద చలికి కప్పుకున్న శాలువాని తీసేస్తాను." గాలి చెప్పింది.

వెంటనే తుఫాను వేగంతో గాలి అతని మీదకి వెళ్ళింది. కాని, ఆ మనిషి ఆ శాలువాని తన ఒంటి చుట్టూ ఇంకాస్త గట్టిగా చుట్టుకుని, గట్టిగా పట్టుకోవడంతో ఆ గాలి అతని ఒంటి మీది శాలువాని ఎగర కొట్టలేక పోయింది. గాలి ఓడిపోయానని వప్పుకున్నాక సూర్యుడి వంతు వచ్చింది. సూర్యుడు మేఘాల చాటునించి బయటకి వచ్చి, ఆ శాలువా కప్పుకున్న అతన్ని చూసి మధురంగా నవ్వాడు.

కొద్దిసేపట్లోనే అతను తన నుదుట పట్టిన చెమటని తుడుచుకుని, తన ఛాతీ మీద కప్పుకున్న శాలువాని తీసేసాడు. సూర్యుడు గాలితో చెప్పాడు.

"మిత్రమా! కోపం కన్నా మృదుత్వం, బలవంతం కన్నా మిత్రత్వం బలమైనవని తెలుసుకో."

## 79. పరమాత్మని చేరే ఓ దారిది

ఓ వర్షం రాత్రి ఓ పెద్దమనిషి బస్ స్టాప్‌లో వేచి ఉన్న ప్రయాణీకుల ముందు తన కారుని ఆపి, కొందరికి లిఫ్ట్ ఇచ్చాడు. కొద్ది దూరం వెళ్ళాక ఒకతను చెప్పాడు.

"నేరుగా పోనివ్వండి స్వామి. కుడివైపు తిరిగితే కిలోమీటరున్నర దూరం ఎక్కువ వెళ్ళాలి."

"నేరుగా వెళ్తే ఒన్-వే-ట్రాఫిక్ కదా!"

"ఇంత రాత్రి పోలీసులెవరూ ఉండరు."

ఆ పెద్దమనిషి కారుని కుడి వైపుకే తిప్పాడు. కొద్ది దూరం వెళ్ళాక ట్రాఫిక్ రెడ్ లైట్స్ దగ్గర అతను కారాపాడు .

"పోనివ్వండి. ఎర్ర లైటు వెలుగుతున్నా అటు, ఇటు ఏ వాహనాలూ లేవుగా." మరొకతను కొద్దిగా విసుగ్గా చెప్పాడు.

అయినా ఆకుపచ్చ లైటు వచ్చేదాకా ఆగి ఆ తర్వాతే కారుని పోనించాడాయన. కారు వాళ్ళ గమ్యస్థానం చేరాక వాళ్ళంతా 'థాంక్స్' చెప్తే ఆ పెద్దమనిషి వాళ్ళతో చెప్పాడు .

"నేను ట్రాఫిక్ రూల్స్‌ని ఖచ్చితంగా పాటించడం వల్ల మీరంతా అసహనానికి గురయ్యారు కదా? 'పట్టుబడం' అన్న సందర్భంలో కూడా ఏ తప్పూ చేయకూడదు అన్న నియమాన్ని నేను పాటిస్తాను. అప్పుడిక అవకాశం వచ్చిన పెద్ద నేరాన్ని చేయాలన్న ఆలోచనే రాదు. దీన్నే వాసనా, సంస్కారాలంటారు. చెడ్డ వాసనా, సంస్కారాలని కల్లో కూడా దగ్గరికి రానివ్వకూడదు. మనల్ని ఎవరైనా పర్యవేక్షించని సందర్భంలో కూడా

* * * * *